# న్యాయం

డాక్టర్ ఎం.పి.ఆర్. రాధాకృష్ణ



ఎక్స్‌ప్రెస్ బస్ శరవేగంగా పరుగెడుతూంది.

ప్రయాణీకులలో చాలామంది కునికిపాట్లు పడుతున్నారు. ఒకరిద్దరు మండిపోతున్న ధరల గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. డబుల్ సీటులో ఆశీనులై ఉన్న ఇద్దరుశాస్త్రులు తాజా రాజకీయాలను నెమరువేస్తున్నారు. కార్నరు సీటు కాలేజి కుర్రాడు...కిటికీలోంచి బయటకు చూస్తున్న పల్లెటూరి పిల్లవైపు దొంగచూపులు విసురుత్నాడు.

ఇవేవీ పట్టించుకోనట్లు బస్సు వేగంగా పరిగెడుతున్నది.

ఇంతలో...కునికిపాట్లు పడుతున్న వాళ్ళు, ధరల గురించి, రాజకీయాల గురించి ఊరికే మధనపడి పోతున్నవాళ్ళు, దొంగచాటుగా బీటు కొడుతూన్న కాలేజి కుర్రాడు, డబ్బులెక్కచూసు కుంటున్న కండక్టరు—అందరూ ఒక్కసారి తూలి పడబోయి నిలదొక్కుకున్నారు.

ఒక్కసారిసడెన్‌బ్రేకు పడటంతో...కీచుమని మూలుగుతూ ఆగిపోయింది, బస్సు. ఏంజరిగిందో నని అందరూ తలలు నిక్కించి చూశారు...! అప్పటికే డ్రైవరు బస్సు దిగేశాడు

బస్సు ముందు జనం...

రక్తపుమడుగులో గిలగిల కొట్టు కుంటున్నాది...కోడిపుంజు ! కొన్ని క్షణాలు అలా కొట్టుకున్న తర్వాత, మరి కొట్టుకోవడం మానేసింది

''పాపం.. సచ్చిపోనాది...'' అన్నారెవరో, గుంపులోనుండి.

''ఇయ్యాల దాని జీవుడి కీ బస్సుకింద రాసిపెట్టుంది. ఎవుడాపగలడు...'' అన్నాడు మరొకడు, మొదటివాడిని వేదాంత ధోరణిలో బలపరుస్తూ ..

ఇంతలో ఓ వ్యక్తి పరుగు పరుగునవచ్చాడు.

''అయ్యో నాకోడి.. నా బంగారు కోడి... పందెం కోడి...నిష్కారణంగా చంపేశారు...'' అంటూ గుండెలు బాదుకొని, బస్సు వైపు... దాని డ్రైవరు వైపు, బస్సులోని జనాలవైపు 'ఈ తప్పంతామీదే' అన్నట్టు గుడ్లురిమిజూశాడు.

డ్రైవరు ఇబ్బందిగా కదిలి.. ''అయితే ఈ కోడి నీదా...''అన్నాడు. ఇంకేమనాలో తోచక !

''నాదికాప్తోతే, నీదా! పందెం కోడిపుంజుది. పంటిపిల్లాడ్ని సాగినట్లు సాకాను. నా సొంత బిడ్డనాగ నూసుకున్నాను నీకు మట్టించిడానికి నా కోడే దొరికిందా ..'' అన్నాడా వ్యక్తి గట్టిగా! అలా అంటూనే రెండడుగులు ముందుకువేశాడు.

అసంకల్పితంగా డ్రైవరు కొంచెం వెనక్కి తగ్గాడు. తగ్గి .''రోడ్డుమీద కోళ్లని, కుక్కల్ని బలాదూరుగా వొగ్గేస్తే ఎలాగ ? ఇది ట్రంకు రోడ్డు...'' అన్నాడు కాస్త బింకంగా !

''అలాగే నాయనా...ఇది ట్రంకురోడ్డే... నీ బాబేయించాడు దీన్ని. అందుకని రోడ్డెక్కిన

పెతీదాన్నీ మట్టించి! మట్టించేసి దర్జాగా కబుర్లాడు...''—అంటూ గుంపును తోసుకొని ముందుకు వచ్చాడు, ఓ వ్యక్తి.

వచ్చి, కోడిపుంజు ఓనరు వీపుతట్టి... ''నువ్వుండరా, వెంకాయ్. ఈ యవ్వారమేదో నేను తేలుస్తాను...'' అన్నాడు, గుప్ గుప్పున చుట్టపొగ వదులుతూ !

అతను నల్లగా, దృఢంగా ఉన్నాడు. అతను మాట్లాడుతూంటే అసలే చిన్నవైన కళ్లు మరింత కుంచించుకుపోయి గమ్మత్తుగాఉన్నాడు. అతన్ని చూసిన ఎవరైనా అతనో చిన్నసైజు రాజకీయ నాయకుడని ఇట్టే తెలిసిపోతుంది. ఏ సమితి ప్రెసిడెంటో...కాకపోతే కొంపదీసి జిల్లాపరిషత్ చైర్మనో అన్నట్లున్నాడు, అతను. అతనా గుంపుముందుకు రాగానే...గుంపు...అతని పట్ల గౌరవసూచకంగా అన్నట్టు కొంచెం వెనక్కి తగ్గింది.

అతను చుట్టూ కలియజూసి, నోటిలో నుండి చుట్టతీసి, తుపుక్కున వుమ్మి, నడుం మీద చేయివేసి ఠీవిగా నిలబడి ఏమంటావన్నట్లు చూశాడు, డ్రైవరువైపు.

అతనెవరో...అతనితో ఎలా మాట్లాడాలో తెలీని డ్రైవరు కాస్త తికమకపడ్డాడు. తికమక పడి గొంతుసవరించుకొని...''కోళ్లూ, కుక్కలూ బస్సు కిందపడితే కేసు లేదండి...'' అన్నాడు. వెనుకటి బింకం అతనికి తెలీకుండానే సడలి పోయింది.

''ఓహో...'' అన్నాడా వ్యక్తి... భుజాలు ఎగరేసి! తరువాత గట్టిగా, వెటకారంగా నవ్వాడు. ''అదీమాట.. ఇనండయ్యా. ఈయనగారు బస్సు తోల్తే రోడ్డుమీద ఎవరూ ఉండకూడదట. ఉంటే...కాలికింద నల్లిని నలిపేసినట్లు మనల్ని బస్సు సెక్రాలకింద పెట్టి మట్టించిస్తాడన్న మాట. ఇదేటి న్యాయంరా బాబూ...అంటే, దిక్కున్నకాడికి సెప్పుకోమంటన్నాడు...'' అని, మళ్లీ...మరింత వెటకారంగా నవ్వేడు.

''అదికాదండి... '' డ్రైవరు ఏదో చెప్పబోయాడు.

''ఏదికాదండీ...! మరి నువ్వేం సెప్పకండి. ఆకాడి కొస్తే రూల్సు మాకూ తెలుసండి. నిజవేనండి. కోడి బస్సుకింద పడితే కేసునేదండి! నిజవే... లేదు! మరయితే ఆకోడి నీ బస్సుకింద పడిపోడానికన్జెప్పి రోడ్డుమద్దెన కూకొని జెపం సేస్తన్నదా? లేదే...! ఉన్నట్టుండి తుర్రున రోడ్డెక్కింది. అదీబాబూ ఇసయం. ఇయ్యాల ఈ కోడయింది. రేపెవడో గుంటెదవడు టపీమని రోడ్డెక్కేస్తాడు. ఎక్కేస్తాడు, బాబూ. ఎక్కేస్తాడు...ఎవడు సెప్పగల్డు! చెప్పలేం, నీలాటి దొరబాబులు బస్సులు తోల్తా ఉంటారని ...గుంటెదవ...ఆడికి తెలవదు కదా! అందుకని రోడ్డుమీదికి లగెత్తుకొస్తాడు. అప్పడు నువ్వీ కోడిని నంజీసుకున్నట్టే...ఆడినీ నంజీసుకో...నీ కడ్డేటి...'' అన్నాడతను చుట్టూచూసి, చేతులు తిప్పుతూ !

అతని మాటలకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ గుంపులోని జనాలు తలలాడించారు. చిన్నగా నవ్వేరు, కూడా!

అంతవరకూ తతంగాన్ని చూస్తున్న బస్సులోని ఇద్దరు శాల్తీలు గబగబా బస్సు దిగేశారు. దిగి...ఆ వ్యక్తి దగ్గరకు వచ్చారు.

''బాబూ...తమరెవరోగాని చాలా బాగా సెలవిచ్చేరు. అహింసా సూత్రాన్ని ఆచరించిన గాంధీగారి దేశంమనది. వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నాం, మన నాయకులందరం. ఈ రోజు బస్సుకిందపడింది కోడేకావచ్చు. కానీ...అదికూడా మనవంటి ప్రాణే ! దానికీ ప్రాణముంది. దానికీ నిండు జీవితముంది. అటువంటి నిండు జీవితం క్షణంలో యిలా రోడ్డుమీద అంతమైపోడం భరించరాని విషయం. ఈ కోడి చనిపోవడం ద్వారా...ఈనాడు మనమొక ప్రాణిని పోగొట్టు కున్నాం. దాని ఆత్మకు శాంతి కలుగుగాక !'' అన్నాడు వారిలో ఒకడు.

''అదండీ, మాటంటే... రూల్సు తెలవ క్కాదు మేమిక్కడికొచ్చింది. అన్నేయం జరిగిపోతా వుంటే ఎవుడూ సూస్తూ ఊరుకోడు కదా !'' అన్నాడు, చుట్టశాల్తీ.

అతనలా అనగానే ఖద్దరువాలాల్లో రెండో అతనికి ప్రాణం లేచివచ్చినట్లయింది... ''నిజం, నిజం ! అన్యాయమనేది ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి జరిగినా... మనలాటి లీడర్లు కలిగించుకోక తప్పదు...'' అన్నాడు, ఉత్సాహంగా !

అదే సమయంలో కార్నరు సీటు కాలేజి కుర్రాడు కంట్రీ బ్యూటీవైపొకసారి చూసి, సదరు చిన్నది తనవేపే చూస్తున్నదని గ్రహించ గానే హుషారుగా కిందికి దిగేశాడు.

''అయ్యా లీడర్లూ ! మీ వాదనలు, సమర్థింపులు బాగానే ఉన్నాయిగాని, మీరెంత మొత్తుకున్నా ఆత్మాహుతి చేసుకున్న కుక్కుట వీరుడు బ్రతకడు, కదా ! అందుకని కోడిపుంజును బ్రతికించే షరతు మినహాయించి, ఈ బస్సు కదలడానికి ఏంచేయాలో చెప్పండి...'' అన్నాడు.

అని, క్రీగంట అమ్మణ్ణి వైపు చూశాడు.

అమ్మణ్ణికి అబ్బాయి మాటలు నచ్చినట్లు న్నాయి. కిసుక్కున నవ్వింది.

చుట్టశాల్తీ... కుర్రాడివైపు ఎగాదిగా చూసి, కాస్త చిరాకు, మరికాస్త కోపం మొహం లోనికి తెచ్చుకోబోయి... ఏమనుకున్నాడో... ఏమో, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. విరమించుకున్న తర్వాత... ''అదేగదా... ఆలోసిస్తన్నాం...'' అని కొంచెం ఆలోచించి... ''ఏముందీ... కండక్టేరుబాబు కోడి కరీదు ఇచ్చుకుంటే, సరి...'' అంటూ చిటికెలో తేల్చిపారేశాడు.

కండక్టరు ఇంతవరకూ మాట్లాడకుండా తతంగమంతా చూస్తున్నాడు. చుట్టశాల్తీ ఇవ్వబోయే తీర్పు అతని కెప్పుడో తెలుసు. ఆ విధంగా యిటువంటి కేసుల్ని పరిష్కరించడం అతని సర్వీసులో యిది మొదటిసారి కాదు. ఇదే ఆర్టీసీ బస్సయితే చచ్చిన కోడి కోసం అసలు బస్సు ఆగనే ఆగదు. కానీ తమది ప్రయివేటు బస్సు. రోజుకి నాలుగుసార్లు ఆ రూటు వెంట తిరగాలి. కాబట్టి యిటువంటి అవాంతరాలు వచ్చినపుడు పాతికో, పరకో పారేయడం పరిపాటే!

కాబట్టి చుట్టశాల్తీ సూచించిన పరిష్కా రాన్ని విని కండక్టరు కంగారు పడలేదు !

''కోడి కరీదు ఎంతేమిటి ...'' అన్నాడు, కలెక్షన్ బ్యాగ్‌లో చేయిపెట్టి !

చుట్టశాల్తీ... విలాసంగా చుట్టపొగ గుప్.. గుప్పున వదిలాడు. వదిలి, విచిత్రంగా నవ్వాడు... నవ్వి....

''అలా ఉన్నమాటున అడిగిస్తే...గభిక్కున ఎలాగ సెప్పేమంటావ్ ! అసలా కోడి కథేటి... సంగతేటి. ఇయన్నీ ముందు ఆలోచించుకోవాల. మనిషి రోడ్డుమీద సస్తే వక రేటు, రైలు పెమాదంలో కునికిస్తే ఓ రేటు, ఇమానం కూలిపోయి బొగ్గయిపోతే యింకో రేటు ... అవునా, కాదా ...'' అన్నాడు.

''సెబాష్ ! అయితే మీ కోడి విమానం కింద పడిందంటారు. అంతేనా ...'' అన్నాడు కాలేజి కుర్రాడు, హుషారుగా !

''ఇమానం కాదు. బస్సే ! అయితే మాత్రం... మనం కోడి హిస్టరీ కూడా ఆలో సించాల. అసలది ఏం కోడి ! పందెం కోడి. కోడి పందెమంటే ఏంటి ! డబ్బు !! ఈ కోడి బతికుండి రేప్పొద్దున పందెం గనుక కొట్టుంటే మా ఎంకాయ్‌గాడికి వెయ్యిరూపాయలు లాభం. ఏమంటారు ...'' అన్నాడు చుట్టశాల్తీ, చుట్టూ చూసి !

''అవ్... నువ్వన్నదే నిజెం, అన్నా ! ఈ పుంజును కొట్టే పుంజే లేదీ వూళ్లో ... '' అన్నాడొకడు, కించిత్ ఆవేశంగా !

'ఏమంటావ్ ...' అన్నట్టు చూశాడు చుట్టశాల్తీ, కండక్టరు వైపు.

కండక్టరు గుండె గుభేలుమంది... ''వెయ్యి రూపాయలా...'' అన్నాడు, నోరు వెళ్లబెట్టి !

చుట్టశాల్తీ చిద్విలాసంగా నవ్వాడు; నవ్వి... ''వెయ్యిరూపాయలంటే ... వెయ్యే ! అయితే నాకు న్యాయం ముఖ్యం. కోడి సచ్చి నందుకు ఆడికీ, పొరపాటున తొక్కించేసినందుకు మీకూ...ఇద్దరికీ న్యాయం జరగాల. అందుకని... ఓ అయిదొందలు... పారెయ్యి,అం‹...'' అన్నాడు.

''అయిదు వందలా ! కోడి అయిదు వంద లయితే నేనూ పట్టుకొస్తా ఓ పది కోళ్లు. డ్రైవర్‌గారూ... పారాహుషార్ ! లాభం చెరి సగం...'' అన్నాడు కాలేజి కుర్రాడు చప్పట్లు కొట్టి, గట్టిగా నవ్వుతూ.

కండక్టరు కెటూ పాలుపోలేదు.

కోడిపుంజు వోనరు ముఖం దివిటీలా వెలిగి

పోతున్నాది. చుట్ట లీడరు పుణ్యామా అని. ఈ రోజు మంచి గిట్టుబాటే!

"పదో .. పాతికో అయితే యివ్వగలం. అయిదొందలంటే కుదర్దు. అయినా కోడి ఖరీదు అయిదొందలా ?" అన్నాడు, కండక్టరు గొంతు పెగల్చుకొని.

చుట్టశాస్త్రి కండక్టరు వైపు జాలిపడుతున్నట్లు చూశాడు, "మే మడిగింది కోడి ఖరీదు కాదు, బెదరూ! దాని ప్రేణం కరీదు. దాన్ని అన్నేయంగా మడ్డరు చేసేసినారుసూడూ.. అందుకు మీకు జెరిమానా అన్నమాట! ఇష్టమయితే అయిదొందలూకట్టి ..బండితోలుకెళ్లు! లేదా. బండెలా కదులుద్దో మేమూజూస్తాం..." అన్నాడు, మొండిగా!

ఇంతలో ఖద్దరు శాస్త్రిలు రెండూ కండక్టరుతోనూ, చుట్ట శాస్త్రితోను, ముందు విడివిడిగా... తర్వాత ఉమ్మడిగా మంతనాలు సాగించారు. సాగి సాగి... చివరికెలా అయితేనేం.. ఓ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం, అదే బస్సులో చుట్టశాస్త్రి ఆ బస్సు వోనరు దగ్గరకు వెళ్లి మాట్లాడతాడు. బేరం సెటిల్ చేసుకు వస్తాడు.

సై... అంటే... సై... అన్నారంతా!

బావుందంటే... బావుందనుకున్నారు.

అందరూ... పొలో అంటూ బస్సు ఎక్కారు.

"ఒరేయ్ వెంకాయ్... పుంజును తీసికెళ్లి మా యింట్లో పడెయ్! మీ పిన్ని కూరతెస్తానని చూస్తా వుంటుంది. నే పట్నంబోయు అంతా సక్కబెట్టు కొస్తాను..." అంటూ కేకేశాడు, చుట్టశాస్త్రి బస్సెక్కుతూ!

"అలాగే, బాబాయ్..." అంటూ హుషారుగా అరిచాడు, సదరు వెంకాయ్!

బస్సు రొదచేసుకుంటూ కదిలి... వెళ్లిపోయింది

*     *     *

"మీ కోడి ఖరీదు అయిదువందలన్న మాట..." అన్నాడు బస్సు ప్రొప్రయిటరు, చుట్టశాస్త్రి వైపు సూటిగాచూస్తూ!

"అయ్. . అంతేనండి, మరి!" అంటూ నాన్పుడు వ్యవహారంలాంటి పని చేశాడు, చుట్ట శాస్త్రి! ఇప్పుడతని చేతిలోగాని, నోటిలోగాని చుట్టలేదు.

ప్రొప్రయిటరు సావకాశంగా సోఫాలో కూర్చొని ఉన్నాడు. చుట్టశాస్త్రి నిలబడే ఉన్నాడు. ప్రొప్రయిటరు తనను కూర్చోబెట్టి మర్యాదలు చేస్తాడని అతను వూహించాడు. కానీ అలా జరగలేదు. చుట్టశాస్త్రి నిలబడే ఉన్నాడు, పాపం, ఇబ్బందిగా!

ప్రొప్రయిటరు కాస్సేపు ఆలోచిస్తున్నట్లు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత హఠాత్తుగా అడిగాడు.

# న్యాయం

"డబ్బివ్వకపోతే..."

"బస్సు ఆ రూట్లో తిరగదు..." చుట్ట శాస్త్రి, ధైర్యాన్ని కూడదీసుకొని, అన్నాడు.

"తిరగదా! ఎవరు ఆపుతారు నా బస్సును నువ్వేనా!" కటువుగా అన్నాడు, ప్రొప్రయిటరు.

ఈ అకస్మాత్ ఏకవచన ప్రయోగానికి, దానికి తోడు ప్రొప్రయిటరు మాటల్లోని తీక్షణతకు చుట్టశాస్త్రి ఖంగుతిన్నాడు.

పల్చగా నుదుటిమీద చెమటపట్టింది.

"చిత్తం. ఇది నా మాటకాదండి. మా వూరివాళ్లమాట..." మెల్లగా నసిగాడు!

"వాళ్ల లీడరెవరు ? నువ్వేనా ?"

## నిర్వాసితులు

కాలిపోతున్న
ట్రాన్స్‌ఫార్మర్ల మంటల్లో
కడుపు మాడుతున్న రైతన్నల గగ్గోలు.
కొత్తరకం దోపిడీలు
అవినీతి—పక్షపాతం,
కులమత భేదంలేని
జలగల సంతానం.
బాహాటంగానే
జీవితాల్ని పీల్చి పిప్పిచేసే
రైతులపాలిటి రాక్షస యంత్రాంగం.
అప్పుల పాలై
పస్తులకు లోనై
నగరాల నయవంచనలో
పుట్టిన భూమిలోనే
వలస బాధితుడై
అన్యాక్రాంతమైన శ్రమలో
దిక్కును వెదుకుతున్న చేతులు.

— నిఖిలేశ్వర్

'కాదు' అనడానికి చుట్టశాస్త్రికి అభిమానం అడ్డొచ్చింది.

"అయ్ ... నేనే అనుకోండి ... కానీ..." అంటూ నాన్చేశాడు.

ప్రొప్రయిటరు పర్సులో నుండి ఐదు పదులు లెక్కపెట్టి తీశాడు. పక్కనే ఉన్న కండక్టరు చేతికి డబ్బు అందించి ...

"ఈ యాభై ... వాడి మొహానకొట్టు. గోటితో పోయేదానికి గొడ్డలెందుకని, ఈ ముష్టి! కై్, కుయ్ ... మంటే మెడపట్టి బయటకు గెంటు. రేప్పొద్దున మామూలుగా మీ ట్రిప్పులు వేసుకోండి. మన బస్సును ఆపగలిగే దమ్మున్న వెధవెవడో చూద్దాం! అసలు ... కోళ్లను, కుక్కల్ని రోడ్డుమీదికి వదిలి ట్రాఫిక్‌కు అడ్డు పడినందుకు వీడిని, వీడి వెంట ఎవడైనా వస్తే వాడిని, లాకప్‌లో తోయించి తోలు వలిపించేస్తాను ..."

అని తీవ్రంగా అని, చుట్టశాస్త్రివైపు కనీసం చూడనైనా చూడకుండా, లేచి లోనికి వెళ్లిపోయాడు, విసవిసా!

కండక్టరు దగ్గర డబ్బు తీసుకుని, ముఖాన నవ్వులాంటి వెకిలి భావాన్ని పులుముకుని, పైకండువాతో నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ ఆ యింటి నుండి బయటపడ్డాడు, చుట్టశాస్త్రి!

ఆ మర్నాడు ...

అదే ఎక్స్‌ప్రెస్ బస్సులో తన వూరిలో దిగిన చుట్టశాస్త్రిని చూడగానే కోడిపుంజు వోనరు పరుగులాంటి నడకతో అతని దగ్గరకు చేరుకున్నాడు.

తనను అక్కడ దిగవిడచి వెళ్లిపోతున్న బస్సువైపు ఒకసారి చూసి, అప్పుడు వెంకాయ్ వైపు చూశాడు చుట్టశాస్త్రి! చూసి—

"నిన్నకోడినేంజేశావ్..."అంటూఅడిగాడు.

"నువ్వు సెప్పావుగదా...ఇంట్లో యిచ్చిశాను. ." అన్నాడు, వెంకాయ్.

చుట్టశాస్త్రి జేబులోనుండి చుట్ట తీసి వెలిగించాడు. వెలిగించి అడిగాడు "ఎవరింట్లో?"

"ఇంకెవరింట్లో ..! మనింటికాడే! నువ్వే జెప్పావ్‌గా, పిన్ని సూస్తవుంటది, ఇచ్చిరారా, అని..." అన్నాడు, వెంకాయ్ సంబరంగా!

"అవ్...అవ్..." అని తలాడించి, ఏమీ తెలియనట్లు ముందుకు అడుగేశాడు,చుట్టశాస్త్రి.

అతని వెనుకే రెండడుగులు వేసి..."ఇంతకీ మన యవ్వారమేటయిందేటి ?" అంటూ, ఇక ఉండబట్టలేక అడిగేశాడు, వెంకాయ్.

"ఏ యవ్వారం..." అని, ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా..."ఓ,అదా"...అంటూనే కించిత్ గంభీరంగా మారిపోయాడు, చుట్టశాస్త్రి!

"నా కొంప మునిగింది గదరా, నీ ఎదవ యవ్వారంతో! ఆ బాబు నిన్ను పోలీసోళ్ల కప్పజెప్తానన్నాడు. మనోడివికదాని ఆయన్ని బతిమలాడి చల్లబర్చినా! మధ్యవర్తిత్వం జరిపినందుకు నామీద ఎగిర్నాడు. అదురుష్టంబాగుండి పోబట్టిగాని...లేకుంటే ఈపాటికి నిన్నూ, నీకు మద్దతిచ్చినందుకు నన్నూ కైదులతోసి బొమికలు ఇరగ్గొట్టి ఉందురు. ఈపాటి కేదో అయిపోనాదిగాని, ఇంకెప్పుడూ కోళ్లని రోడ్ల మీద వొగ్గమాకు." అని నోట్లోంచి చుట్టతీసి, తుపుక్కున వుమ్మి, తిరిగి చూడకుండా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోయాడు, చుట్టశాస్త్రి!

వెంకాయ్... వెర్రిమొహం వేసుకుని చూస్తూ వుండిపోయాడు.

ప్రొప్రయిటరు యాభై రూపాయలిచ్చినట్లు, ఆ మొత్తం ప్రభుత్వ సారా దుకాణానికి, రంగమ్మ డిపోకి జమై పోయినట్లు వాడికి తెలీదు. ★